స్నేహగీతం.. సేవామార్గం

- ఆపదలో ఉన్న వారికి అండగా గుడ్‌ఫ్రెండ్స్ ఫేస్‌బుక్ గ్రూప్ సభ్యులు
- పలు సేవా కార్యక్రమాల నిర్వహణ

కంబాలచెరువు: ఫేస్‌బుక్ అనగానే సాధారణంగా టైమ్‌పాస్ కోసం ఉపయోగించే మాధ్యమంగా భావిస్తాం. దీనిలో అనేక మంది తమ ఫొటోలు, వీడియోలు, మీమ్స్, టిప్స్ వంటివి షేర్ చేస్తూ ఉంటారు. వాటిపై కామెంట్లు, అభినందనలు, వ్యంగ్య వ్యాఖ్యానాలను చూస్తుంటాం. కానీ ఫేస్‌బుక్‌ను సేవ చేయడానికి ఒక వారధిగా ఉపయోగిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు గుడ్‌ఫ్రెండ్స్ గ్రూప్ సభ్యులు. వీరందరూ ధనికులు కాదు, ఒకచోట ఉండే స్నేహితులూ కాదు. అయితేనేం ఒక్కమాటపై కొనసాగుతూ తమకు తోచిన సాయం చేస్తూ పలువురిని ఆదుకుంటున్నారు.

సేవకు ప్రతిరూపం

గుడ్‌ఫ్రెండ్స్ గ్రూప్‌లో అనేక మంది సభ్యులున్నారు. వీరిలో తూర్పుగోదావరి, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల వాసులతో పాటు బెంగళూరు, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన వారూ ఉన్నారు. వీరంతా నిత్యం ఏదో ప్రాంతంలో సేవా కార్యక్రమం నిర్వహిస్తారు. ఆపదలో ఉన్న వారికి సహాయం అందిస్తూ, సేవకు ప్రతిరూపంగా నిలుస్తున్నారు. వివిధ ప్రాంతాలలో ఉన్న వారందరూ తమకు తోచిన విధంగా సొమ్ములు పోగుచేసుకుని, ఆపదలో ఉన్నవారికి అందజేస్తున్నారు.

ఆపదలో ఉన్నవారికి సాయం

గుడ్‌ఫ్రెండ్స్ గ్రూప్ సభ్యులు ప్రతి నెలా తమ సంపాదనలో వంద రూపాయలను గుడ్‌ఫ్రెండ్స్ చారిటీకి ఇస్తారు. అలా సేకరించిన మొత్తాన్ని ఆపదలో ఉన్న వారికి ఇచ్చి ఆదుకుంటారు. రెండేళ్ల క్రితం అతి కొద్దిమందితో ప్రారంభమైన ఈ గ్రూప్‌లో ప్రస్తుతం వేల సంఖ్యలో సభ్యులు ఉన్నారు. రక్తదాన శిబిరాలు నిర్వహించడం, అన్నదానం చేయడం, ఆర్థిక ఇబ్బందులతో తినడానికి ఇబ్బంది పడుతున్న కుటుంబాలకు నిత్యావసరాలు పంపిణీ చేయడం వీరి నిత్యకృత్యం.



కేన్సర్‌తో బాధపడుతున్న బాలుడికి ఆర్థిక సాయం చేస్తున్న గుడ్‌ఫ్రెండ్స్ గ్రూప్ సభ్యులు



పేద కుటుంబానికి నిత్యావసరాలు అందజేస్తున్న సభ్యులు

బాలుడి చికిత్సకు..

కాకినాడకు చెందిన ఒక బాలుడు కేన్సర్‌తో విశాఖపట్నం ఆసుపత్రిలో మృత్యువుతో పోరాడుతున్నాడు. విషయం తెలుసుకున్న గుడ్‌ఫ్రెండ్స్ పేస్‌బుక్ ఛారిటీ గ్రూపు సభ్యులు ఆ బాలుడికి సహాయం చేయాలని నిర్ణయించుకున్నారు. దాదాపు రూ.80 వేలు సమకూర్చుకుని రాజమహేంద్రవరం నుంచి మోటారు సైకిళ్లపై వైజాగ్‌కు వెళ్లి బాలుడికి అందించారు. ఇప్పటి వరకూ దాదాపు 53 కుటుంబాలకు నెలకు సరిపడా నిత్యావసరాలు పంపిణీ చేశారు. అలాగే రక్తదాన శిబిరాలను నిర్వహించారు. పేదలకు భోజనం వితరణ, వేసవి కాలంలో మజ్జిగ పంపిణీ తదితర కార్యక్రమాలు చేపట్టారు.

సాయం చేయడమే లక్ష్యం



ఆపదలో ఉన్నవారిని గుర్తించి, వారిని ఆదుకోవడమే గుడ్‌ఫ్రెండ్స్ గ్రూప్ ముఖ్య ఉద్దేశం. గ్రూపులోని సభ్యులందరూ సహాయం చేస్తే ఇంకా మరెన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తాం. గ్రూప్ చేస్తున్న సేవలను చూసి మిగతా సభ్యులు ముందుకు వస్తున్నారు.

– నాగచక్రం, గుడ్‌ఫ్రెండ్స్ గ్రూప్ అడ్మిన్, కాకినాడ

బాలుడికి సాయం



కేన్సర్‌తో బాధపడుతున్న బాలుడి చికిత్సకు రూ.15 లక్షలు అవసరమవుతాయి. వారిది చాలా నిరుపేద కుటుంబం. గ్రూప్ తరపున మావంతుగా సాయం అందించాం. అందరూ ముందుకు వచ్చి మృత్యువుతో పోరాడుతున్న ఆ బాలుడికి సహాయం అందించి ప్రాణాలు నిలపాలని కోరుతున్నాను. ఆ బాలుడి వివరాలు గుడ్‌ఫ్రెండ్స్ గ్రూప్‌లో ఉన్నాయి.

– మందవల్లి సుజాత, గ్రూప్ మెంబర్, కోరుకొండ

వైద్య శిబిరాల నిర్వహణ



అందరికీ సహాయం చేసే దిశగా గుడ్‌ఫ్రెండ్స్ గ్రూప్ సిద్ధమవుతోంది. ఇప్పటికే ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తూ అందరిని అభిమానాన్ని సొంతం చేసుకుంటోంది. త్వరలో గ్రూప్ ద్వారా వైద్య శిబిరాలు నిర్వహించి వైద్య సహాయం అందిస్తాం. ఆ దిశగా చర్చిస్తున్నాం. సేవాగుణం ఉన్న వారంతా గ్రూప్‌లో చేరి సహాయ సహకారాలు అందజేయవచ్చు.

– కె.సిరి, గ్రూప్ అడ్మిన్, బెంగళూరు

మరిన్ని కార్యక్రమాలు



అతి కొద్దిమందితో మా గ్రూప్ ప్రారంభమైంది. మేము చేస్తున్న సేవా కార్యక్రమాలను అభినందిస్తూ ఎందరో ముందుకు వస్తున్నారు. ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరికీ సేవలు అందేలా గ్రూప్ అడ్మిన్లు, మోటరేటర్లు, ఇతర సభ్యుల ద్వారా పర్యవేక్షిస్తున్నాం. త్వరలో గ్రూప్ ఈవెంట్ జరగనుంది. మూడేళ్లు పూర్తి కావస్తున్న సందర్భంగా మరిన్ని సేవా కార్యక్రమాలు చేసే దిశగా ఆలోచిస్తున్నాం.

– సతీష్ కుమార్, అడ్మిన్, హైదరాబాద్

క్లుప్తంగా

కేంద్ర బడ్జెట్‌పై సీపీఎం నిరసన

ప్రకాశం నగర్: కేంద్ర బడ్జెట్‌లో మోదీ ప్రభుత్వం గతంలో మాదిరిగానే కార్పొరేట్లకు రూ.కోట్లను వడ్డించిందని సీపీఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ విమర్శించారు. ఈ మేరకు సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం స్థానిక శ్యామల సెంటర్‌లో నిరసన తెలిపారు. అరుణ్ మాట్లాడుతూ కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌ వరుసగా ఏడోసారి ప్రవేశపెట్టిన బడ్జెట్‌లోనూ సామాన్యులకు ఉత్తమాటలే దక్కాయని విమర్శించారు. ముఖ్యంగా మన రాష్ట్రానికి తీవ్ర నిరాశ కలిగించిందని, మాటలు ఘనం.. చేతలు శూన్యం అన్నట్లుగా ఉందన్నారు. విభజన చట్టంలోని అన్ని అంశాల అమలుకు నిధులు ఇస్తారని ఆశించిన ప్రజలకు నిరాశే ఎదురైందన్నారు. సంక్షోభంలో ఉన్న విశాఖ ఉక్కును ఆదుకోకపోగా గత సంవత్సరం కన్నా రూ.63 కోట్లు తగ్గించారని తెలిపారు. విశాఖ పోర్టుకు రూ.125 కోట్ల కోత పడిందని వివరించారు.

విద్యా సమస్యలపై వినతి

కడియం: విద్యా సమస్యలను వెంటనే పరిష్కరించాలని యూటీఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.అబ్బాయి, వి.శాస్త్రి డిమాండ్ చేశారు. ఈ మేరకు యూటీఎఫ్ జిల్లా కోశాధికారి టీవీఎస్ ప్రసాద్ ఆధ్వర్యంలో మండల విద్యా వనరుల కేంద్రంలో ఎంఈవోలు మణికుమార్, వై.నాగేశ్వరరావుతో పాటు మండల అధికారులకు గురువారం వినతి పత్రం అందజేశారు.

నేడు విద్యుత్ అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: వార్షిక మరమ్మతుల కారణంగా శుక్రవారం నగరంలోని పలు ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి శామ్యూల్ తెలిపారు. ఉదయం 8 నుంచి 11 గంటల వరకూ మోరంపూడి జంక్షన్, సాయి నగర్, గాదాలమ్మ నగర్, వెంకటగిరి –2, హనుమాన్ నగర్, జైహింద్ నగర్ ప్రాంతాల్లో అంతరాయం కలుగుతుందన్నారు.

- ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ కృష్ణానగర్, కోర్లంపేట, ఆర్యాపురం, తుమ్మలోవ, కోటిలింగాలపేట, సీతంపేట ప్రాంతాలలో విద్యుత్ ఉండదన్నారు.
- ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ టి.నగర్, డీలక్స్ సెంటర్, శ్యామలా సెంటర్, ఆల్కాట్ గార్డెన్స్, ఇన్నీస్‌పేట, కోటిపల్లి బస్టాండ్, రైల్వే స్టేషన్ ప్రాంతాలలో విద్యుత్ అంతరాయం కలుగుతుందని తెలిపారు.

కార్గిల్ విజయ దినోత్సవం



ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

రాజమహేంద్రవరం సిటీ: భారతీయ జనతా పార్టీ యువ మోర్చా ఆధ్వర్యంలో గురువారం కార్గిల్ విజయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. యువ మోర్చా జిల్లా అధ్యక్షుడు కందికొండ రమేష్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల నుంచి లాలాచెరువు అమర వీరుల పార్క్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం లాలాచెరువు సైనికుల పార్క్ వద్ద కాగడాల ప్రదర్శన నిర్వహించి, పార్క్‌లో ఉన్న అమర జవాన్ల విగ్రహాలకు పుష్పాంజలి ఘటించారు. కార్యక్రమంలో బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులు సోము వీర్రాజు, జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రేలంగి శ్రీదేవి పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రం పరిశీలన

కడియం: వేమగిరి సచివాలయం– 4లో గురువారం ఏర్పాటు చేసిన ఆధార్ నమోదు శిబిరాన్ని ఎంపీడీవో జి.రాజ్‌మనోజ్ పరిశీలించారు. ప్రజలకు అందుతున్న సేవలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. కొత్తగా ఆధార్ కార్డు నమోదుతో పాటు మార్పులు చేర్పులు, ఆధార్, అప్‌డేట్ వంటివి చేసుకోవాలన్నారు. కాగా..ఈ నెల 23న ప్రారంభమైన ఆధార్ నమోదు శిబిరాలు ఈ నెల 27 వరకూ కొనసాగుతాయి.

గురుచరిత్ర పారాయణ ప్రారంభం



గురుచరిత్రను పారాయణ చేస్తున్న భక్తులు

రాజానగరం: ప్రపంచ శాంతి, లోక కల్యాణార్థం స్థానిక షిరిడీ సాయిబాబా ఆలయంలో గురుచరిత్ర పారాయణ యజ్ఞం గురువారం ఘనంగా ప్రారంభమైంది. అక్టోబర్ పదో తేదీ వరకూ 11 గురువారాలు ఈ కార్యక్రమం నిర్వహిస్తామని సాయిబాబా భక్తమండలి సభ్యులు తెలిపారు. మధ్యలో ఒక వారం సాయిసచ్చరిత్రను పారాయణ చేస్తారు. ప్రతి గురువారం తెల్లవారుజామున ఇచ్చే కాకడ హారతి అనంతరం ఉదయం 6 గంటలకు పారాయణను ప్రారంభించి, మధ్యాహ్నానికి పూర్తి చేస్తారు. ఆసక్తి ఉన్నవారు ఈ పారాయణలో పాల్గొనవచ్చు.

కౌలురైతు కార్డుల పంపిణీ

కడియం: సాగు రైతులకు కౌలు కార్డుల పంపిణీని ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్ గురువారం మండల కేంద్రమైన కడియంలో ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు వెలుగుబంటి రఘురామ్, రైతులు, వ్యవసాయశాఖాధికారులు పాల్గొన్నారు.

జాతర ప్రశాంతంగా నిర్వహించుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ అంబికా ప్రసాద్

కంబాలచెరువు: ఇన్నీస్‌పేట రెడ్డీల సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 30 నుంచి జరిగే కన్నమాంబ తల్లి జాతరను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని సౌత్ జోన్ డీఎస్పీ అంబికా ప్రసాద్ సూచించారు. ఈ మేరకు ఉత్సవ నిర్వాహక కమిటీతో గురువారం ఇన్నీస్‌పేట రామాలయం వద్ద సమావేశం నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ జాతరలో అసాంఘిక కార్యక్రమాలు, అశ్లీల నృత్యాలు వంటి వాటికి తావివ్వొద్దన్నారు. భక్తులకు ఇబ్బందులను లేకుండా, ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు వలంటీర్లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చట్ట ప్రకారం కఠినమైన చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో రెండో పట్టణ శాంతి భద్రతల పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ వి.శ్రీనివాస్, నిర్వాహక కమిటీ పెద్దలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వీడని ముంపు.. తప్పని అవస్థలు

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరు నేతాజీ నగర్ వీధులతో పాటు హుకుంపేట రామకృష్ణ నగర్, సావిత్రీ నగర్ వీధులలో ముంపు కొనసాగుతోంది. గోదావరి వరద ఉధృతంగా ప్రవహించడంతో రాజమహేంద్రవరం నుంచి ధవళేశ్వరం సాయిబాబా గుడి వద్దకు వెళ్లే ఆవకాలువ పొంగిపొర్లుతోంది. దీంతో రెండు రోజులుగా బొమ్మూరులోని నేతాజీనగర్ 4, 7, 14, 15 వీధులు మునిగిపోయాయి. డ్రైనేజీల్లోకి ముంపునీరు వచ్చి చేరింది. హుకుంపేట గ్రామంలోని రామకృష్ణ నగర్ ప్రధాన వీధితో పాటు పలు వీధులు, సావిత్రీ నగర్ ప్రాంతం ముంపు బారిన పడ్డాయి. హుకుంపేటలో ముంపునీటిలో పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. వాటి నుంచి ఎటువంటి వ్యాధులు ప్రబలుతాయోనని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో ముంపు ప్రాంతాలలో పంచాయతీ కార్యదర్శులు సిబ్బందితో బ్లీచింగ్ చల్లిస్తున్నారు. మండలంలోని 1,260 ఎకరాల్లోని వరి పొలాలు ఇంకా ముంపులోనే ఉన్నాయి. గోదావరిలో నీరు తగ్గుముఖం పడితేనే జల్ల కాలువ, ఆవ కాలువల ద్వారా ముంపునీరు గోదావరిలో కలిసే అవకాశం ఉంది.



హుకుంపేట రామకృష్ణ నగర్‌ను చుట్టుముట్టిన నీరు

అన్ని రంగాలలో ప్రతిభ చూపాలి



కడియంలో సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు



వివిధ వేషధారణలలో అలరించిన విద్యార్థులు

కడియం: విద్యార్థులు అన్ని రంగాలలో ప్రతిభ చూపాలని ఎంఈవో వై.నాగేశ్వరరావు అన్నారు. శిక్షా సప్తాహ్ ఐదు రోజు కార్యక్రమంలో భాగంగా గురువారం హైస్కూల్లో సాంస్కృతిక కార్యక్రమాలు ఘనంగా ప్రదర్శించారు. హెచ్‌ఎం టి.సత్యనారాయణ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. ఆరో తరగతి విద్యార్థిని శరణ్య, పదో తరగతి విద్యార్థిని మోహన పవిత్ర తమ అభినయంతో ఆకట్టుకున్నారు. పాటలు పాడిన షిరిన్ సిస్టర్లను ఎంఈవో అభినందించారు. ఉపాధ్యాయులు శ్రీనివాస్ దుర్యోధనుని ఏకపాత్రాభినయం, తెలుగు ఉపాధ్యాయుడు గొల్లపల్లి సత్యనారాయణ జానపద గేయం పిల్లల్ని ఉర్రూతలూగించింది. కార్యక్రమంలో పాల్గొన్న చిన్నారులకు జ్ఞాపికలు, సర్టిఫికెట్లు అందజేశారు. ఉపాధ్యాయులు డేవిడ్, సువర్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న విద్యార్థుల ప్రదర్శన

కంబాలచెరువు: విద్యార్థుల్లో దాగిన సృజనాత్మకతను బయటకు తీసేందుకు సాంస్కృతిక కార్యక్రమాలు దోహదపడతాయని అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్ కుమార్ అన్నారు. శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా గురువారం స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ వేషధారణలలో అలరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎంవీఎం. సుబ్రహ్మణ్యం, సీఆర్పీ జయంతి శాస్త్రి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సిబ్బంది గైర్హాజరుపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు

కడియం: డ్యూటీ సమయంలో గైర్హాజరవుతున్న భవిత సిబ్బందిపై కడియం ఉప సర్పంచ్ వెలుగుబంటి రఘురామ్ గురువారం ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. స్థానిక ఒకటో నెంబరు ప్రాథమిక పాఠశాల ఆవరణలో భవిత కేంద్రం ఏర్పాటు చేశారు. మండలంలోని 11 గ్రామాలకు చెందిన ప్రత్యేకావసరాలు గల చిన్నారులు ఈ కేంద్రం ద్వారా సేవలు పొందాల్సి ఉంది. ఇక్కడ విధులు నిర్వహించేందుకు ఇద్దరు ఉపాధ్యాయులు, ఒక ఆయాను నియమించారు. అయితే ఒక ఉపాధ్యాయురాలితో పాటు, ఆయా కూడా హాజరుపట్టీలో సంతకాలు చేసి బయటకు వెళ్లిపోయారు. తరచూ ఇదే పరిస్థితి ఉండడంతో కేంద్రానికి వచ్చిన పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు నాని దృష్టికి తీసుకువచ్చారు. దీంతో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరెడ్డితో పాటు కేంద్రం వద్దకు పరిశీలనకు వెళ్లారు. అప్పుడు కూడా అక్కడ ఉపాధ్యాయురాలు, ఆయా లేరు. అంతే కాకుండా కేంద్రం వద్దకు వచ్చిన విద్యార్థులకంటే ఎక్కువ మంది వచ్చినట్లుగా రిజిస్టర్‌లో నమోదు చేశారు. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు వెలుగుబంటి నాని తెలిపారు.

28న మంత్రి దుర్గేష్, ఎమ్మెల్యే శ్రీనివాస్‌కు సత్కారం

ప్రకాశం నగర్: రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్, సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్‌ను ఈ నెల 28వ తేదీన ఆనంద్ రీజెన్సీలోని పందిరి ఫంక్షన్ హాలులో సత్కరించనున్నట్లు కాపు సంక్షేమ సంఘం ఆహ్వాన కమిటీ సభ్యులు తెలిపారు. ఈ మేరకు గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘం సభ్యులు రామినీడి మురళీ, అల్లూరి శేషు నారాయణ, దొండపాటి సత్యంబాబు, చింతం వీరబాబు ఆ కార్యక్రమ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా కాపులందరూ ఈ కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు.

లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కంబాలచెరువు: స్థానిక ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జువాలజీ, కంప్యూటర్ సైన్స్, బీకాం, కంప్యూటర్ అప్లికేషన్స్ బోధించడానికి అర్హులైన మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాఘవ కుమారి కోరారు. ఆయా సబ్జెక్టులలో 55 శాతం మార్కులు కలిగి ఉండాలన్నారు. అర్హులైన వారు ఈ నెల 29వ తేదీ లోపు దరఖాస్తు చేసుకుని, 30వ తేదీ ఉదయం 10 గంటలకు కళాశాలలో జరిగే ఇంటర్వ్యూలకు సంబంధించిన సర్టిఫికెట్లతో హాజరుకావాలని కోరారు.

హరి తాడోజు చిత్రానికి ప్రధాని అభినందన



ప్రధాని మోదీ ధ్యానం చేస్తున్నట్టుగా హరి తాడోజు గీసిన చిత్రం

రాజమహేంద్రవరం సిటీ: నగరానికి చెందిన ప్రముఖ చిత్రకారుడు, స్ట్రోకర్స్ అధినేత హరి తాడోజు గీసిన చిత్రం ప్రధాని నరేంద్ర మోదీ మన్ననలు పొందింది. ప్రధాని కన్యాకుమారిలో ధ్యానం చేస్తున్నట్టుగా ఓ చిత్రాన్ని హరి తాడోజుతో మాజీ ప్రధాని హెచ్‌డీ దేవగౌడ వేయించారు. దానిని గురువారం న్యూఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోదీకి దేవగౌడ బహూకరించారు. ఆ విషయాన్ని ప్రధాని నరేంద్ర మోదీ తన ట్విట్టర్ ఖాతాలో పోస్ట్ చేశారు. ఈ విషయం తనకు ఎంతో సంతోషాన్నిచ్చిందని హరి తాడోజు తెలిపారు.

జల్ జీవన్ మిషన్ పనులు వేగవంతం చేయాలి



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ ప్రశాంతి తదితరులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): పెండింగ్‌లో ఉన్న జల్ జీవన్ మిషన్ పనులను వేగవంతం చేయాలని అధికారులను కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. తన క్యాంపు కార్యాలయ సమావేశ మందిరంలో గ్రామీణ నీటి సరఫరా (ఆర్‌డబ్ల్యూఎస్) అధికారులతో ఆమె గురువారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, జల్ జీవన్ మిషన్ ద్వారా జిల్లాలో రూ.489 కోట్లతో చేపట్టిన 670 పనుల్లో ఇప్పటి వరకూ 355 పూర్తయ్యాయని, మరో 84 పనులు పురోగతిలో ఉన్నాయని అన్నారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద జిల్లాలో రూ.19.29 కోట్లతో 243 డ్రైన్ల నిర్మాణం చేపట్టగా 25 పనులు పూర్తయ్యాయని, 46 పురోగతిలో ఉన్నాయని మిగిలినవి పూర్తి చేసేందుకు కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. సచివాలయాల పరిధిలో రూ.11.76 కోట్లతో చేపట్టిన 392 కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్‌లకు 331 పూర్తి కాగా 49 పురోగతిలో ఉన్నాయని అన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కింద రూ.43.58 కోట్లతో చేపట్టిన 1,263 పనులకు 820 పూర్తయ్యాయని, 26 పురోగతిలో ఉన్నాయని, మిగిలినవి పూర్తి చేయాలని సూచించారు. ప్రతిపాదిత పనుల్లో రూ.5 లక్షల లోపు పెండింగ్ పనులు తక్షణం పూర్తి చేయాలని కలెక్టర్ ప్రశాంతి ఆదేశించారు. ఈ కేటగిరీ కింద జిల్లాలో 13 పనులు ఉన్నాయని అధికారులు చెప్పారు.

మరిన్ని పనిదినాలు కల్పించాలి

జిల్లాలో గ్రామీణ ఉపాధి హామీ పథకంలో మరిన్ని పనిదినాలు కల్పించాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. తన క్యాంప్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఈ పథకం లక్ష్యాలు, ప్రగతిపై ఆమె గురువారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గత ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకూ ఉపాధి కూలీలకు 30 లక్షల పని దినాలు కల్పించి, రూ.66.7 కోట్ల వేతనాలు చెల్లించామని తెలిపారు. జిల్లాలో ఉపాధి కూలీలకు సగటున రూ.250 అందిస్తున్నామని, మరిన్ని పనులు చేపట్టి సగటు వేతనం రూ.300 అయ్యేలా ప్రణాళిక అమలు చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ సూచనలకు అనుగుణంగా గ్రామీణ ప్రాంతాల్లో సీసీ రోడ్లు, సిమెంట్ డ్రైన్లు తదితర మౌలిక సదుపాయాల పనులు చేపట్టాలని అన్నారు.

కారం తమ్మన్న దొరకు నివాళి



తమ్మన్న దొర చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న సూర్యనారాయణ తదితరులు

సీటీఆర్ఐ: ఆంగ్లేయులతో పోరాటిన తొలి గిరిజన వీరుడు కారం తమ్మన్నదొర వర్ధంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని, రంపచోడవరం కేంద్రంగా జిల్లాను ఏర్పాటు చేసి తమ్మన్నదొర పేరు పెట్టాలని ఆదివాసీ మహాసభ న్యాయ సలహాదారు అయినాపురపు సూర్యనారాయణ డిమాండ్ చేశారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో తమ్మన్న దొర వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. సూర్యనారాయణ మాట్లాడుతూ ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ సందర్భంగా కారం తమ్మన్నదొర చరిత్ర వెలుగులోకి వచ్చిందన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ మహాసభ ప్రతినిధులు పాల్గొన్నారు.

సాధారణ బదిలీతో సరిపెట్టేస్తారా..



జీజీహెచ్‌లో నిరసన తెలుపుతున్న సిబ్బంది

కంబాలచెరువు: ఓ ఉద్యోగి ప్రాణం విలువ కేవలం సాధారణ బదిలీయేనా అని రాజమహేంద్రవరం మినిస్ట్రీరియల్ సిబ్బంది ప్రశ్నించారు. కాకినాడలోని ఫైలేరియా రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ సెంటర్ సీనియర్ అసిస్టెంట్ రాధాకృష్ణ మృతికి సంతాపం తెలిపారు. ఈ మేరకు గురువారం రాజమహేంద్రవరం జీజీహెచ్‌లోని మినిస్టీరియల్ విభాగంలో నిరసన తెలిపారు. ఆసుపత్రి మేనేజర్ కోసూరి కేదారేశ్వరరావు మాట్లాడుతూ కేవలం వైద్యాధికారి, విచారణాధికారి దురహంకారమే ఓ నిండు ప్రాణాన్ని బలిగొందన్నారు. ఘటనకు కారకురాలైన మెడికల్ ఆఫీసర్ సాయి రోహిత్‌పై కేవలం బదిలీ వేటు కంటితుడుపు చర్యేనన్నారు. రాధాకృష్ణను విచారణ చేసిన ఎంక్వైరీ ఆఫీసర్ వ్యక్తిగత విషయాలను ప్రస్తావించాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. నిరసనలో ఏడీ శ్రీనివాస్ సింగ్, సీనియర్ అసిస్టెంట్ వై.స్టాలిన్, కె.శ్రీలక్ష్మి, వి.సత్యవాణి. వై.యోహాన్, జూనియర్ అసిస్టెంట్లు ఎస్.దీప్తి మినిస్టీరియల్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ మార్గాలలో నీటి తరలింపునకు చర్యలు

మధురపూడి: కోరుకొండ మండలం మధురపూడి విమానాశ్రయంలోని డ్రైనేజీ వ్యవస్థ, మధురపూడి పంట కాలువలను ఆర్డీవో చైత్రవర్షిణి, ఎయిర్‌పోర్టు డైరెక్టర్ జ్ఞానేశ్వరరావు, కోరుకొండ తహసీల్దార్ రాజ్యలక్ష్మి గురువారం పరిశీలించారు. విమానాశ్రయంలో కురిసిన వర్షం నీరు, వాడకం నీరంతా మధురపూడి కాలువల ద్వారా బయటకు ప్రవహిస్తుంది. ఈ సమయంలో తమ పొలాలను ముంపునకు గురవుతున్నాయని పలువురు రైతులు ఇటీవల కలెక్టర్ ప్రశాంతికి ఫిర్యాదు చేశారు. ఆమె ఆదేశాల మేరకు ఆర్డీవో చైత్రవర్షిణి పరిశీలనకు వచ్చారు. ఈ సందర్భంగా ఆర్డీవో చైత్రవర్షిణి మాట్లాడుతూ ఎయిర్‌పోర్టు నుంచి వస్తున్న నీటిని ప్రత్యామ్నాయ మార్గంలో తొర్రిగెడ్డలోకి పంపేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ వి.నరేష్, ఇరిగేషన్ అధికారులు, వీఆర్వోలు, సంబంధిత రైతులు పాల్గొన్నారు.

అసెంబ్లీ సమావేశాలను వీక్షించిన విద్యార్థులు

సాక్షి, అమరావతి: రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు గురువారం అసెంబ్లీ సమావేశాలను వీక్షించారు. ఈ మేరకు వీరికి అనుమతి ఇచ్చినట్టు స్పీకర్ అయ్యన్నపాత్రుడు 'ఎక్స్'లో తెలిపారు. ఉన్నత చదువులు చదివిన విద్యార్థులు రాజకీయాల్లోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశాలను వీక్షించడం ద్వారా రాజకీయాలపై పట్టు సాధించేందుకు, అసెంబ్లీలో చట్టాలపై, ప్రజా సమస్యలపై చర్చలు ఎలా జరుగుతాయి, చట్టాలు ఎలా చేస్తారు అనే దానిపై అవగాహన పెంచుకునే అవకాశం ఉందన్నారు. విజిటర్స్ గ్యాలరీ నుంచి వీరిని గంటకు పైగా సమావేశాలు వీక్షించేందుకు అనుమతించారు.

సినిమాలు



శ్యామల	రాయన్
సూర్యమినీ	డెడ్‌పూల్ అండ్ వోల్వరిన్
సూర్యప్యాలెస్	రాయన్
స్వామి	డెడ్‌పూల్ అండ్ వోల్వరిన్
అశోక	కల్కి2898ఏడి
శివజ్యోతి	డెడ్‌పూల్ అండ్ వోల్వరిన్
అనుశ్రీ	డార్లింగ్
రంభ	పురుషోత్తముడు
ఊర్వశి	భారతీయుడు-2
మేనక	డెడ్‌పూల్ అండ్ వోల్వరిన్
కుమారి	ఆపరేషన్ రావణ్
అప్సర	డెడ్‌పూల్ అండ్ వోల్వరిన్
నామవరం	
వీఎస్ మహల్	రాయన్
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	రాయన్
	డెడ్‌పూల్ అండ్ వోల్వరిన్
కడియం	
వెంకటసూర్య	రాయన్,
	డెడ్‌పూల్ అండ్ వోల్వరిన్